# మృత్యులోయలో రెండు చిత్రాలు

ఊరినంతా చీకటి చుట్టేసింది. మేలుకున్న విద్యుద్దీపాలతో చిమ్మచీకటి మంతనాలు చేస్తూ ఉంది. రెండు, మూడు ఇళ్ళలో వాళ్ళు తప్పితే అందరూ నిద్రలోకి జారుకున్నాయి.

మెలుకవో, నిద్రో తెలీని స్థితిలో ఇద్దరు ముసలివాళ్ళు మృత్యుగృహం గవాక్షం దగ్గర నిలబడి ఉన్నారు.

వాళ్ళిద్దరూ బాల్యస్నేహితులే ! మృత్యువు కూడా వాళ్ళిద్దరితో ఒకే సమయంలో జతకట్టే ప్రయత్నం చేస్తూంది. పెంకుటింట్లో నులక మంచం మీద పడి ఉన్న నర్సయ్య అయినా, ఆకుపచ్చ మేడలో ఏ.సీ. రూములో పడుకున్న లక్ష్మీకాంతయ్య అయినా మృత్యుదేవతకు ఒక్కటే... గొప్ప సోషలిస్టు మృత్యుదేవత...

నర్సయ్య చేతికి ఇంజెక్షన్ చేశాడు. డాక్టరు.

ఆ ప్రయత్నం మళ్ళీ నర్సయ్యని మరి కొన్ని గంటలు బ్రతికించడానికి తప్పితే, మామూలు మనిషిని చేయడానికి కాదు. జీవం పోసుకుని ఎనభై ఏళ్ళు ఆయన శరీరంలో కదలాడిన జీవకణాలు మరి కొంతసేపట్లో జీవరహితంగా మారబోతున్నాయి.

"ఆ ఇంజెక్షన్ ప్రభావం మరో రెండు మూడు గంటలు మాత్రమే! ఆ తరువాత మీ రేమన్నా ఆఖరి మాటలు చెప్పాలంటే చెప్పేయ్యండి. ఒకటి, రెండు మాటల కంటే ఎక్కువగా మీతో మాట్లాడకపోయినా మీరు చెప్పేది వినే స్థితిలో ఉన్నాడు. అవసరం అయితే మళ్ళీ కబురు చెయ్యండి." – నర్సయ్య పెద్ద కొడుకు మోహన్‌తో అనేసి వెళ్ళిపోయాడు డాక్టరు.

ఇంటిల్లిపాదీ ఆయన మంచం చుట్టూ మూగేరు.

'ఒంట్లో ఏదో కొంచెం నలత తప్పితే, ఆయన కేం కాలేదు. రెండు, మూడు రోజుల్లో మామూలు మనిషవుతా'డనే భావనే ఆయన ముందు ప్రకటించారందరూ. తమ మొహాల్లో విషాదచ్ఛాయలు కనిపించకుండా జాగ్రత్తపడ్డారు.

"నాన్నగారూ! మనింట్లో అందరూ మీ ఎదురుగా నిలబడ్డారు. అందరిని చూసే ప్రయత్నం చెయ్యండి. మీ మనవడు మీ మంచం మీదే కూర్చున్నాడు. 'శ్రీరాముని దయచేతను' పద్యం నేర్చుకున్నాడట. మీకు అప్పజెప్పాలట. చిన్నమ్మాయి గుంటూరు నుంచి వచ్చింది. బావగారి వ్యాపారం బాగానే ఉందట" అన్నాడు మోహన్ తండ్రి ఛాతీమీద చెయ్యి వేసి సున్నితంగా నిమురుతూ.

నర్సయ్య గురక తగ్గింది కాని, కళ్ళు తెరిచే ప్రయత్నం చెయ్యలేదు.

పెద్ద కోడలు ప్లేటులో మామిడిపండు రసం పిండుకుని ఆ గదిలోకి వచ్చింది.

"మన దొడ్లో మీరు నాటిన మామిడి చెట్టుకు తియ్యటి రసాలు కాస్తున్నాయి నాన్నా? మీకు నూజివీడు రసాలంటే ఇష్టం కదూ?" అంటూ ప్లేటులోని మామిడి రసం చూపుడు వేలికి రాసుకుని తండ్రి పెదాలపైన రాశాడు మోహన్.

నర్సయ్య పెదాలు కొద్దిగా కదిలేయి.

వాళ్ళందరూ ఆయన్ని మాట్లాడించే ప్రయత్నం చేశారు. ఆయన మనస్సుకు కష్టం కలుగకుండా ఇంట్లో భోజనాల దగ్గర కూర్చుని అందరూ సరదాగా మాట్లాడుకున్నట్లు మాట్లాడేరు. మరి కొన్ని గంటల్లో ఆయన తమను విడిచి వెళ్ళిపోతున్నాడనే ఆలోచననే రానివ్వకుండా ఇంట్లో జరిగినవన్నీ పూసగుచ్చినట్లు చెప్పారు.

"బాగా పొద్దుపోయింది. మీ నాన్న దగ్గర నేను కూర్చుంటాను గాని మీ రందరూ వెళ్ళి పడుకోండి" అంది నర్సయ్య భార్య వనజాక్షమ్మ.

అందరినీ గదిలో నుంచి బయటకు తీసుకెళ్ళాడు మోహన్. వెళ్ళిపోయే ముందు మనవ డొచ్చి తాత బుగ్గ మీద ముద్దు పెట్టి వెళ్ళాడు.

"మన పెళ్ళయి ఏభై అయిదేళ్ళయింది. ఎప్పుడూ పోట్లాడుకుని ఎరుగం. ఎప్పుడన్నా కోపంతో నేను చిటపటలాడినా మీరు సర్దుకుపోయేవారు. నవ్వుతూ ఓ క్షణం చూసేసరికి నా కోపమంతా మాయమయ్యేది. మళ్ళీ జన్మంటూ ఉంటే మీరే నాకు తోడు కావాలి" మంద్రస్వరంతో అంది వనజాక్షమ్మ.

మెల్లగా కళ్ళు తెరిచాడు నర్సయ్య కుడి చెయ్యి దేనికోసమో వెతుకుతున్నట్లుగా మెల్లగా కదిల్చేడు.

ఆమె తన చేతిని ఆయన చేతిలో ఉంచింది. "వనజాక్షీ! తృప్తిగా ఉంది. చనిపోతున్నాననే బాధ లేదు." అతి కష్టంమీద అస్పష్టంగా అనగలిగేడు ఆ మాటలు. నూతిలో నుంచి వచ్చినట్లున్నాయి మాటలు.

కళ్ళు మూతలు పడసాగాయి.

ఆయన చెయ్యి చల్లబడటం గమనించిందామె. ఆమె కళ్ళలో నీళ్ళు తిరిగేయి. ఆఖరిసారిగా ఆయన నుదురు చేత్తో నిమిరింది.

మరి కొంత సేపటికి కట్టెలా బిగుసుకుపోయింది ఆయన శరీరం.

☆ ☆ ☆

లక్ష్మీకాంతయ్య కూడా చావుబతుకుల్లో ఉన్నాడు.

విశాలమైన ఆకుపచ్చ మేడ పై భాగంలో ఏ.సీ. రూములో యూఫోమ్ బెడ్ మీద పడుకుని ఉన్నాడు. ఎనభై ఏళ్ళ వయస్సులో పండుటాకులా ఉన్నాడు మనిషి. గంట కోసారి వచ్చి చూసి వెళుతూ ఉంది ఆయన సేవలకోసం ప్రత్యేకించిన నర్సు.

ఆయనను చూడటానికి వచ్చిపోయే వాళ్ళు ఎవరూ లేరు.

లక్ష్మీకాంతయ్యకు రైసు మిల్లులు, సినిమా థియేటర్లు ఉన్నాయి. ఒంట్లో సత్తువ ఉన్న రోజుల్లో డబ్బు సంపాదన ఒక్కటే జీవితాశయంగా పెట్టుకోవడంతో అందరికీ దూరమయ్యాడు. ఆయనకు తోడయింది లక్షల కొద్దీ డబ్బు మాత్రమే.

వయస్సు మీద పడేసరికి అనారోగ్యం, ఒంటరితనం ఆయనతో స్నేహం మొదలుపెట్టాయి. ఆయన మంచం పట్టడంతో వ్యాపార విషయాల్లో రెండో భార్య గీతాదేవి చక్రం తిప్పడం మొదలుపెట్టింది.

లక్ష్మీనాయుడిని ఎన్నోసార్లు నర్సయ్య హెచ్చరించాడు.

“జీవితానికి డబ్బే ప్రధానం కాదురా. అందరితో సాన్నిహిత్యం పెంచుకో, అవతల వ్యక్తి మనకు ఎంతవరకూ పనికొస్తాడని బేరీజు వేసుకోకు, భార్య పిల్లలతో కలిసి మెలిసి ఉండు. ఇప్పుడు నువ్వు నలుగురితో పంచుకున్న ప్రేమ, ఆత్మీయత చివరి రోజుల్లో నీకు తోడవుతాయి” అనేవాడు నర్సయ్య.

నర్సయ్య మాటలు లెక్కచెయ్యలేదు లక్ష్మీకాంతయ్య. డబ్బు సంపాదన తప్పితే మరో వ్యాపకం లేదు. ఏ రోజు ముచ్చటగా పిల్లలతో మూడు మాటలు మాట్లేదేవాడు కాదు.

వాళ్ళిద్దరూ చిన్నప్పటి నుంచి కలిసిమెలిసి తిరిగేరు. కోతికొమ్మచ్చులాట, బిళ్ళంగోడు, ఆకాట కలిసే అడేవారు. స్కూల్లో కూడా పక్కపక్కనే కూర్చునేవారు.

లక్ష్మీకాంతయ్య సంపాదనలో పడ్డాక నర్సయ్యకు దూరమయ్యాడు.

చివరి రోజుల్లో లక్ష్మీకాంతయ్య పక్కన ఎవ్వరూ లేరు. కొడుకు లిద్దరూ అమెరికాలో

స్థిరపడిపోయారు. కూతురు కెనడాలో ఉంది. రెండో భార్య గీతారెడ్డికి మహిళా మండలి, వ్యాపారం గొడవల మీద ఉన్నంత మక్కువ మగనిమీద లేదు. రోజు కోసారి మొక్కుబడిగా మేడపైకి ఎక్కి భర్తను చూసి వెళుతుంది.

ఆస్తిలో ఎక్కువ భాగం అమెరికాలో ఉన్న ఇద్దరు కొడుకులకే రాసివ్వడంతో గీతాదేవికి లక్ష్మీకాంతయ్య మీద గుర్రుగానే ఉంది. ఆయన ఆరోగ్యం క్షీణిస్తున్నా పట్టించుకోవడం మానేసింది.

మొదటి భార్య కొడుకులకు కూడా కబురు చెయ్యలేదు. 'ఒక్కసారే ఆయన చనిపోయేక చెయ్యొచ్చులే' అనుకుందామె. "గీతాదేవిగారూ! మీ రొచ్చి ఆయన దగ్గరుండండీ. ఊపిరి పీల్చుకోవడమే కష్టంగా ఉందాయనకు. ఆఖరి క్షణాల్లో ఉన్నారాయన" అంది నర్సు గీతారెడ్డితో.

ఆయన గదిలోకి వెళ్ళి నిలబడింది గీతాదేవి. "చనిపోవడానికి సిద్ధంగా ఉన్న వాళ్ళని చూడాలంటేనే నాకు భయం. అదేదో పూర్తయ్యాక కబురు చెయ్యి. ఏర్పాట్లు చేయిస్తాను" అంటూ అయిదు నిముషాల పాటు అక్కడవుండకుండానే మేడ దిగి కింది భాగంలోకి వెళ్ళిపోయింది గీతాదేవి.

ఆమె మాటలు లక్ష్మీకాంతయ్య చెవుల్లో పడ్డాయి. బాధగా మూలిగిందాయన మనస్సు. అతికష్టంమీద కళ్ళు తెరిచి చూశాడు. గదంతా వెతికేయి ఆయన కళ్ళు.

కొడుకులు, మనవళ్ళు, కూతురు – ఎవ్వరూ కనిపించలేదు గదిలో అశాంతిగా తల అటూ, ఇటూ కదిల్చేడు.

నర్సయ్య కూడా చావుబ్రతుకుల్లో ఉన్నాడని నర్సు చెవిలో వేసిన వార్త గుర్తుకు వచ్చింది లక్ష్మీకాంతయ్యకు.

"నర్సయ్యా ! నువ్వు చెప్పింది నిజం. ఎనభై ఏళ్ళు బ్రతికినా తృప్తిగా బ్రతికిన క్షణాలు కనీసం ఎనభై కూడా లేదో ఏమో! ఆస్తి పంచి ఇచ్చానేగాని అనురాగాన్నీ, ప్రేమనీ ఎవ్వరికీ పంచి ఇవ్వలేదు. అందుకే చివరి క్షణాల్లో నా చావు నన్ను చావమని వదిలేశారు. మిగతా విషయాలు తీరిగ్గా పైన కలుసుకుని మాట్లాడుకుందాం నర్సయ్యా!"

లక్ష్మీకాంతయ్య కళ్ళు మూతలు పడ్డాయి. శరీరం చల్లబడింది.,

ఏ.సీ. రూములోని శీతల వాయువు మరింత చల్లగా ఆయన శరీరాన్ని స్పృశించింది. ✻

**(ఆంధ్రప్రభ వారపత్రిక - 31-8-1998)**